సాహితి:

# బొమ్మ దొంగ ఆచూకీ

పి. మధుసూదన ప్రసాద్

"అన్నయ్యా! ఇక్కడ పెట్టిన బొమ్మలు తీసేవా" అంటూ ఇంట్లోంచి కేకేసింది లక్ష్మి. "ఏం బొమ్మలే" అంటూ ముఖం కడుక్కుంటున్న వాడిని ఆ పని పూర్తి చేసి ఇంట్లోకెళ్ళా. లక్ష్మి బిక్క ముఖంతో విచారంగా బొమ్మల ముందు నిలబడి ఉంది. "రెండు బొమ్మలు కనపడలే దన్నయ్యా" అంటూ లక్ష్మి ఆ బొమ్మ లుండాల్సిన స్థానాన్ని వేలెట్టి చూపించింది. "ఏం బొమ్మలు" అంటూ తిరిగి ప్రశ్నించా. "రాధా కృష్ణుల బొమ్మ లన్నయ్యా! అంత అందమైన బొమ్మలు మనకు ఇక లేనే లేవు" అంటూ బిక్క మొగంతో నే జవాబిచ్చింది. అప్పట్లో లక్ష్మి పరిస్థితి చూస్తే నాకు చాలా జాలి వేసింది. జాలి వేసిందేగాని లక్ష్మిని ఓదార్చటానికే ఉపాయమూ నాకు తోచలా. ఆ రెండు బొమ్మలంటే లక్ష్మికి ఎంతో ఎక్కువ మక్కువ. అసిగాక ఆరోజే బొమ్మల పండుగ. బొమ్మలపండుగ రోజుల్లో బొమ్మలంటే ఎవరికిష్టముండదు? ఉన్న బొమ్మలన్నిటిలో నిజంగా ఆ రెండు బొమ్మలే బాగుండేవి. ఆ రెండు బొమ్మలే మిగిలిన వాటికొక క్రొత్త రకమైన శోభ చేకూర్చేది.

"లక్ష్మీ! ఆ బొమ్మలు మళ్లీ నీకు తెచ్చియిస్తానులే" అంటూ బుజ్జగింపు ధోరణిలో మాట్లాడాను. లక్ష్మి ఆత్రుతతో "వాటిని నువ్వు తీసి దాచావా అన్నయ్యా?" అంది. "లేదు వాటినెవరో దొంగిలించారు" అనేటప్పటికి లక్ష్మి విచారంతో అక్కడే కూలబడిపోయింది. "లక్ష్మీ! ఆ బొమ్మలు తిరిగి నీకు తెచ్చియిస్తానుగాని, నిన్న మనింటికి బొమ్మలు చూడటానికి ఎవరెవరు వచ్చారో చెప్పు" అన్నాను. "పాప, రంగడూ, మోహన్, పార్వతి, జయా వచ్చారన్నయ్యా."

"నిన్న ఎప్పుడు వచ్చారు"?

"బొమ్మలు పెట్టిన తరువాతే"

"ఆ రెండు బొమ్మలు అందరికీ చూపించావా?"

"ఆ"

"వాళ్ళందరూ కూడా బొమ్మలు పెట్టుకున్నారా?"

"ఆ"

"మరి నువ్వు వాళ్ల బొమ్మలు చూసివచ్చావా?"

"లేదు."

అప్పుడా రెండు బొమ్మలూ ఉండవలసిన చోటు చూశా. అక్కడ కొద్దిగా బొమ్మలుండవలసిన గుర్తులు కనబడుతున్నయ్. పొద్దున్నే చిన్నపిల్లలెవ్వరూ ఇంటికిరాలేదు. కాబట్టి బొమ్మలు దొంగిలించినవాళ్లెవరో నిన్ననే వాటిని దొంగిలించి ఉండాలి. బొమ్మలు పెట్టింది నిన్న మధ్యాహ్నమేనాయె: కాబట్టి నిన్న సాయంత్రమే బొమ్మలు దొంగిలించి ఉండాలె. బొమ్మలను దొంగిలించే అవసరము పిల్లలకే గాని పెద్దవాళ్ళకుండదాయె! నిన్న సాయంత్రం బొమ్మలు చూడటానికి వచ్చిన ఐదుగురిలోనే ఉంటే దొంగ ఉండాలి అని నిశ్చయించుకున్నా. దొంగను పట్టుకొనటానికేమీ ఆధారాలు దొరకలా. "ఏ విధంగా దొంగను పట్టుకోవాలా" అని ఎంత ఆలోచించినా ఏ ఉపాయమూ తట్టలా. ఇంతలో లక్ష్మి నా ఆలోచనకు భంగంకలిగిస్తూ "అన్నాయ్! బొమ్మలు తెచ్చిఇస్తానంటివే! తెచ్చి ఇవ్వు?" అంది.

"తెచ్చిఇస్తానుగాని ఓ పనిచేసి పెట్టు" అన్నాను.

"ఏమిటా పని"

"నువ్వు వాళ్ల ఐదుగురిళ్ళకెళ్ళి ఆ రెండుబొమ్మలు వాళ్లబొమ్మల్లో ఏమన్నా ఉన్నయ్యేమో చూసిరా" అన్నాను వుండపని సందేహిస్తూనే

"అలాగే" అంటూ లక్ష్మి ఒక్కపరుగున వీధిలోకెళ్లింది. మరో అరగంటకల్లా వీధిలోకెళ్లిన లక్ష్మి తిరిగి వచ్చింది.

"ఉన్నాయా లక్ష్మీ!" అంటూ తిరిగి ప్రశ్నించాను.

బాలగేయం:

# ముత్యాలు

వేజెండ్ల సాంబశివరావు

చిటపట చిటపట
చిత్తడి వానలు
కురిసినవమ్మా! కురిసినవి.

చిత్తడి నేలల
ముత్యము లెన్నో
మెరసినవమ్మా! మెరసినవి.

మెరసిన ముత్యాల్
తొందరగా నే
ఏరెదనమ్మా! ఏరెదను!

ఓరిమితో నే
హారము లెన్నో
కూర్చెదనమ్మా! కూర్చెదను.

దండలు నాచిటి
మెడలోమురియగ
కులికెదనమ్మా! కులికెదను!

పకపక వికవిక
నవ్వెద వేలా!
ముత్యాల్ రాలును నా తల్లీ!

## ★ బొమ్మ దొంగ ఆచూకి ★

"లేవు."

లక్ష్మి చేతిలో వున్న వస్తువును చూపిస్తూ "చేతిలో ఏముంది?" అని ప్రశ్నించాను.

"ఇదా! ఇది రాధబొమ్మ తలలే, ఉంటే తీసుకొచ్చా."

"ఎక్కడ పడివుంది?"

"రంగడూ వాళ్ళ యింటి కెదురుగా వున్న ఖాళీస్థలంలో" ఆవస్తువును చేతిలోకితీసుకొన్నాను. అది నిజంగా పోయిన రాధ బొమ్మ తలే! 'బొమ్మలు రంగడే కాజేశాడేమో!' అని అనుమానం తగిలింది. 'మరి బొమ్మ ఎందుకు పగిలి పోయింది?' అనేదానికి సమాధానం దొరకలా. కొంతసేపు ఆలోచించిన మీదట దానికి సమాధానం తొందరగానే దొరికింది.

'నిన్న సాయంత్రం చీకటి పడుతున్నప్పుడు లక్ష్మి అమ్మతో పేరంటానికి వెళ్ళింది. అప్పుడు రంగడు లక్ష్మితో ఆడుకోటానికి వచ్చివుండవచ్చు. అక్కయ్యా వాళ్లూ దొడ్లో ఎప్పుడూ ఏదో ఒక పని చేసుకుంటూ రాయె! బొమ్మల దగ్గర ఎవరూ లేకపోవటంవల్ల ఆ రెండుబొమ్మలనూ కాజేయాలన్న బుద్ధివాడికి కలిగివుండవచ్చు. అందుచేత ఆ రెండు బొమ్మలను తీసివుంటాడు. తన్ని ఎవరైనా చూస్తారేమో! అనే తొందరలో బొమ్మలను తీయటంవల్ల రాధ బొమ్మ చెయ్యిజారి క్రిందపడి ఉండవచ్చు. అది గచ్చుమీద పడటంలో పగిలిపోయింది. ఆ బొమ్మ అంత ఎత్తునుంచి క్రిందపడితే అది రెండు ముక్కలే అవటానికిఅవకాశంలేదు. ఇంకా ఎక్కువ ముక్కలై ఉండాలి. ఒక్కటే కనబడుతోంది. మరి తక్కినవేమైనట్లు? వాటిని కూడా వాడు తీసికొని వెళ్లి ఉండవచ్చు. పెద్దముక్కలైతే వాటిని తొందరగా ఏరగలడు. మరి చిన్నచిన్న ముక్కలైనా ఇక్కడ ఉండాలికదా! ఈ ఆలోచనతట్టటంతోనే ముక్కలేమైనా కనబడుతయ్యేమోనని క్రింద చూశా! క్రింద చూడటంతోనే నా ఆశ అంతా నిరాశ అయింది. ముక్కలేవీ లేవు. ఇల్లంతా శుభ్రంగా ఊడ్చి ఉంది. మళ్ళీ ఇంకొక ఆలోచన తట్టటంచేత "లక్ష్మి ఇల్లు ఊడ్చింది ఎవరు?" అని ప్రశ్నించా.

"సుబ్బి" అంది లక్ష్మి.

"అయితే దాన్నొకసారి పిల్చుకొస్తావా!"

"ఆ" అంటూ లక్ష్మి సుబ్బిని పిల్చుకురావటానికి వెళ్లింది.

మరికొంత సేపటికి లక్ష్మిసుబ్బితో సహా తిరిగివచ్చింది. సుబ్బి రావటంతోనే "ఎందుకయ్యగారూ! పిలిచారుట" అని ప్రశ్నించింది. "నువ్వేనా ఇల్లు ఊడ్చింది" అని ప్రశ్నించా.

"ఊఁ"

"ఎంత సేపయింది ఊడ్చి?"

"ఇంతకుముందే! ఏం బాగో లేదా!"

"బాగానే ఉంది. నువ్వు ఊడ్చినప్పుడు బొమ్మలదగ్గిర ఏమైనా ముక్కలు కనుపించాయా?"

"కనపడ్డాయి"

"చిన్నవా! పెద్దవా!"

"చిన్నవే"

"వాటిని నువ్వేం చేశావు?"

"ఊడ్చి అవతల పారబోశా!"

"సరే! ఇక పోయి నీ పని చూసుకో" అన్నాను. వెంటనే సుబ్బి వెళ్ళిపోయింది. నేను లక్ష్మితో "లక్ష్మి యీ తల దొరికేచోట కొన్ని ముక్కలు పడుంటాయ్. వాటిని వెతికి తీసుకురా" అన్నాను. వెంటనే లక్ష్మి వాటిని తీసుకురావటానికి వెళ్ళింది.

మరి కొంత సేపటికి కొన్ని ముక్కలతో సహా తిరిగివచ్చింది. "ఇవ్వీ అక్కడే దొరికాయా?" అని ప్రశ్నించాను.

"ఇందాక దొరికినచోటకు దగ్గిర్లోనే దొరికాయి."

"ఇంకేం దొరకలా?"

"లేవు"

"సరే ఆ బొమ్మ తెచ్చియిస్తాలే! నీ స్నేహితులొచ్చినప్పుడు వాళ్లతో 'నా బొమ్మలు రెండు పోయాయి' అని చెప్పు. దానికి వాళ్లేమంటారో తిరిగి నాతో చెప్పు. ఇప్పటికి నువ్వు వెళ్లి ఆడుకో" అన్నాను. "సరే" అంటూ లక్ష్మి ఆడుకోటానికి వెళ్ళిపోయింది.

సాయంత్రం ఆరుగంటలైంది. లక్ష్మి నా గదిలోకి వచ్చి "వాళ్లతో నువ్వు చెప్పినట్లే చెప్పానన్నాయ్" అంది ఆత్రంగా.

"దానికి వాళ్లేమన్నారు" అని ప్రశ్నించా.

"పాప, మోహన్, జయ, పార్వతి ఏమన్నారంటే 'ఎప్పుడు పోయినయ్,' 'ఎవరు తీశారు,' 'ఎందుకు తీశారు,' 'మళ్ళీ దొరికినయ్యా' అన్నారు."

"మరి నువ్వేమని సమాధానం చెప్పావ్?"


# చూడండి మెక్లీన్సు దంతాల్ని ఎంత చక్కగా శుభ్రపరుస్తుంది!

పరిష్కరించడానికి సాధ్యంకాని దంతక్షయ సమస్యను ఈ మూడు టి ట్యూబులు విశదీకరిస్తున్నవి. అవే దంతములనుకోండి. వాని ముందుభాగాన్ని శుభ్రం చేయవచ్చు. వెనుక భాగాన్ని శుభ్రపరచవచ్చుకాని, ఆ దంత మధ్యమున్న సందుల మాటేమిటి! అవి మామూలుపద్ధతిలో తోమటానికి అందేవి కావు. అత్యంత అపాయకరమైన విష క్రిములు అక్కడే దాగివుంటాయి. దంత అందాన్ని చెక్కు చెదరకుండా కాపాడుకొందామని అనుకుంటే, ఎప్పటికీ ప్రమాదకరమే అయిన 'క్రైసాయిడ్స్' ను గురించి తప్పక తెలుసుకోవాలి.



మెక్లీన్సు మామూలుపద్ధతిని తోముటలో అందని అపాయకరమైన చోట్లను కూడా దొరకబట్టి శుభ్రపరచును.

## దంతక్షయాన్ని అరికట్టుటకు అత్యంత ప్రధానమైనది అదే

మీ పళ్లమీద ఏర్పడిన దాడిపొరలో కొన్ని కోట్ల పదార్థములున్నవి. వీనినే 'క్రైసాయిడ్స్' అని దంత వైద్యులు పిలుస్తున్నారు. వీనిని ఎంతబాగా తోమినా పోవు. ఆ పొరలోపలా వెనకా అమ్లాలు తమ భయంకరమైన పనిని సాగిస్తూనే వుంటాయి. అవి మీ పళ్ళ పెరుగును తినివేస్తూనే వుంటాయి. ఆ దంతక్షయమును అరికట్టడానికి పోరిపెట్టు ఈ 'క్రైసాయిడ్స్' ను క్రమం తప్పకుండా తొలగిస్తూనే వుండటం.

'క్రైసాయిడ్స్' ని విశేషంగా తొలగించటానికి ఉన్న ఒక్కటే మార్గం, వానిని కరిగించివేయడం. పోటవింటా పరగను కరిగించక అవి దుష్కరమగాను.

చాలా సులభంగా, అతి శీఘ్రంగా 'క్రైసాయిడ్స్' ను, మూలగా పోగొట్టే గుణమును, మెక్లీన్సు కలిగియున్నది. అదే దంత క్షయాన్ని అరికట్టుటకు అత్యంత ప్రధానమైనది.

మెక్లీన్సును క్రమం తప్పక రోజుకు రెండు సార్లు ప్రతిరోజూ వాడండి. మరి, జ్ఞాపకం వుంచుకొనండి. మెక్లీన్సు వాడకంగం వలనే ఆరోగ్యవంతమైన దంతాలు.




క్లోరోఫిల్ కలదిన్నీ లభిస్తుంది

MTY-41-TEL

ప్రతి సోమవారమున్ను రాత్రి 8-30 గంటలనుండి 9 గంటలవరకూ. రేడియో సిలోన్‌లో కమర్షియల్ సర్వీసెస్ 41 మీటర్ బేండ్‌నందు, "మెక్లీన్స ఫిల్మ్ రివ్యూస్" కార్యక్రమాన్ని వినండి.

# ★ బొమ్మదొంగ ఆచూకి ★

"ఏమో! ఎప్పుడు పోయినయ్యో! నాకు తెలియదన్నా!"

"రంగడేమన్నాడు?"

"వాడేం మాట్లాడకుండా ఊరుకున్నాడు"

"నిన్న సాయంత్రం నీకోసం ఎవరన్నా వచ్చారేమో! అక్కయ్యనడిగిరా" అన్నాను. వెంటనే లక్ష్మి ఇంట్లోకి వెళ్ళింది. మరి కొంతసేపటికి లక్ష్మి తిరిగివచ్చి "వాళ్ల రంగడు వచ్చాడట అన్నయ్యా" అంది.

బొమ్మలు రంగడు తీశాడనటానికి మూడు చిన్న చిన్న కారణాలున్నాయ్. ఒకటి పగిలిపోయిన బొమ్మ ముక్కలు వాళ్ళ యింటి దగ్గర దొరకటమే! అయినా వాడే తీశాడని వాడిమీద నింద మోపటానికి అదేమంత పెద్ద కారణం కాదు. రెండోదేమిటంటే లక్ష్మి నాబొమ్మలు పోయినయ్యని వాళ్లతో చెప్పినప్పుడు వాడేమీ మాట్లాడకుండా ఉండటమే! బొమ్మలు వాడే తీసి ఉండటంచేత వాడేమీ మాట్లాడకపోవటం, వాటి విషయం వాడికి తెలిసి ఉండటమే! వాడే కారణం మీద మాట్లాడలేదో? ఎవరికి తెలుసు. మూడో కారణం ఏమంటే నిన్న సాయంత్రం లక్ష్మి ఇంట్లో లేనప్పుడు లక్ష్మికోసం వచ్చినవాడు రంగడే! అందుచేత వాడే బొమ్మలు తీశాడనుకోవచ్చు. ఈ మూడు చిన్న చిన్న అనుమానాల ప్రకారం రంగడికే దొంగతనం అంటగట్టటం ఏమంత సమంజసంగాదు. ఇక నా ఆలోచనలను కట్టిబెట్టి "లక్ష్మి! రంగడి నొకసారి పిల్చుకురా!" అన్నాను. వెంటనే లక్ష్మి రంగడిని పిలుచుకురావటానికి వెళ్లింది.

మరికొంతసేపటికి లక్ష్మి రంగడితోసహా తిరిగివచ్చింది. వాడు రావటం కొంత బెదురుతూనే వచ్చాడు. ఆ బెదురు వాడి కళ్ళల్లోనే కనబడుతూంది. ఆ బెదురు చూచేటప్పటికి నా అనుమానం మరింత ధ్రువపడింది. అందుచేత నేను "రంగడూ! నిన్న నువ్వు తీసుకెళ్ళిన బొమ్మలు తీసుకురా!" అన్నాను. వాడు "ఏంబొమ్మలు?" అని ప్రశ్నించాడు.

"రాధాకృష్ణుల బొమ్మలు"

"వాటి సంగతి నాకేం తెలుసు."

"నీకేం తెలియదా! నిన్న నువ్వు లక్ష్మికోసం వచ్చావు. అప్పుడిక్కడెవరూ లేకపోవటంచేత బొమ్మల్ని తీశావు. తీస్తుంటే ఒకబొమ్మ పగిలిపోయింది. ఆ పగిలిపోయిన బొమ్మ ముక్కలివిగో" అంటూ పగిలిన బొమ్మ ముక్కలను చూపించాను. ఈమాటలనేటప్పటికి రంగడేమనుకున్నాడోఏమో "అవును. నిన్న నేనే తీశాను. ఇక్కడే ఒక బొమ్మ పగిలిపోయింది" అంటూ వెళ్ళి రెండో బొమ్మ మాత్రం తెచ్చియిచ్చాడు. పోయినబొమ్మ తిరిగి వచ్చేటప్పటికి లక్ష్మిముఖం సంతోషంతో వికసించింది. కాని రెండో బొమ్మ పగిలిందని విచారం కలగకుండా ఉండలేదు. ★


In Drawing Cartridge with Tricolour Wrapper.

సాంఘిక శాస్త్రము - అభ్యాస రికార్డు పుస్తకము

(Social Studies Practical Record Book)

| ఫారములు : | I | II | III |
|---|---|---|---|
| ధర. | 0-11-0 | 0-12-0 | 0-14-0 |

విద్యాశాఖవారు ప్రచురించిన ప్రణాళిక ననుసరించి తయారు చేయబడినది.

1-పుస్తకములుకూడాగలవు సాంపిల్ పుస్తకములకు వ్రాసి పొందవచ్చును.

P. Devaraj Gnanaolivu B.A.L.T. & Mrs. Gracer Gnanaolivu B.A.L.T.,

మంగళ పుస్తకాలయము

సుంకంబాకం, చెన్నపురి - 6

పంచతంత్రం

బొమ్మల కథల పుస్తకం

మొదటి భాగం

(మిత్రభేదం, మిత్రలాభం)

కర్త: కీ॥ శే॥

విశ్వాత్ముల నరసింహమూర్తి

వెల: రూ. 1-8-0

ఆంధ్రగ్రంథమాల, మద్రాసు - 1.

మంచీ - చెడూ

వెల 2-0-0

పోస్టుఖర్చు ప్రత్యేకం

ఆంధ్రగ్రంథమాల మద్రాసు.